

కథా కౌముది

# వలలోకి దూకిన చేపలు

పి.రాజేంద్రప్రసాద్

స్నానపాన, సంధ్యావందన జపతపాదులన్నీ సక్రమంగా ముగించి నుదుటిన విభూతి రేఖలతో, ఒంటిమీద పట్టుపంచా, ఉత్తరీయాలతో వెలిగిపోతూ పడక కుర్చీలో విశ్రాంతిగా కూర్చుని ఉన్నాడు శంకర్రావు. అలా ఆయన్ని చూసిన వారెవరైనా వెంటనే చెయ్యెత్తి నమస్కరించే విధంగా ఉన్నాడాయన. పది గంటలకు ఆఫీసైనా పదకొండుకో, ఆపై ఇంకో అరగంటకో నిదానంగా వెళతాడు శంకర్రావు. ఆయన్ని ఎవరూ ఏమీ అనరు. ఆయన సూపర్నెంటుగా పనిచేసే ఆ ఆఫీసులో స్టాఫు పైనించి కిందదాకా ఆయన దగ్గర స్థాయినీ, అవసరాన్నీ బట్టి రూపాయి నుండి అయిదు రూపాయల వడ్డీకి అప్పులు తీసుకున్నవాళ్లే. ఏ అవసరమూ పడని వాళ్ళకి ఏదో విధంగా మాటలు చెప్పి చేబదులైనా ఇస్తాడాయన. పైగా ఎవరు ఎప్పుడు ఎంతోకొంత వడ్డీయో, అసలో ఇచ్చినా అస్సలు పట్టించుకోనట్లు కనిపిస్తూ తన లెక్కలు మాత్రం కరెక్టుగా వేసుకుంటాడు. ఇంతమందికీ ఇలా వితరణ చేయడానికి ఆయన దగ్గర అంతమేరకూ డబ్బు మూలుగుతోంది. అదీ సంగతి.

"నమస్కారం సార్" గుమ్మం అవతలనించి భక్తిగా వినిపించింది ఒక గొంతు.

వాలుకుర్చీలో అర్ధనిమీలితనేత్రుడై ఉన్న శంకర్రావుకు కర్ణపేయంగా వినిపించిందామాట. కళ్ళు తెరిచి చూశాడు. గుమ్మంలో ఉన్నవాళ్లు ఒక ఏభై ఏళ్ల పెద్దమనిషితో పాటు, ఒక ఇరవై సంవత్సరాల కుర్రాడు, బహుశా తండ్రీకొడుకులై ఉంటారు. "కొత్త చేప వలలో పడింది!" మనసులో ఆనందంగా అనుకుంటూ

"ఎవరు బాబూ! నాతో ఏం పనీ? లోపలికి రండి!" తెచ్చిపెట్టుకున్న ఆదరంతో పిలిచాడు శంకర్రావు.

"ఫర్వాలేదండి." అంటూనే లోపలికొచ్చారు వాళ్ళు.

"నా పేరు పవన్ కుమారండి. ఈయన మా నాన్నగారు" అవునన్నట్టు తలూపాడు పెద్దాయన. "మీ ఆఫీసు ప్యూను చలపతిగారు మీ పేరు చెప్పారండి. మీరైతే సాయం చేస్తారని చెప్పి ఈ లెటరిచ్చారండి." అంటూ చేతికో కవరిచ్చాడు ఆ కుర్రాడు.

"అవునా! ఒక్క నిమిషం! మీరిద్దరూ ఇలా కూర్చోండి." అంటూ వాళ్ళని కూర్చోబెట్టి లోపలికెళ్ళి సదరు చలపతికి ఫోన్ చేశాడాయన. "వీడేనా, నువ్వు చెప్పిన కుర్రాడు? ఏం ఫరవాలేదా!" అవతలించి చలపతి చెప్పాడు "ఆయ్! ఆడు మనోడేనండి! మా వేలు విడిచిన మేనమామ గారి తోడల్లుడికి మనవడేనండి. ఫరవాలేదండి." కన్ఫర్మ్ చేసుకుని బయటకు వచ్చాడు శంకర్రావు.

"ఇప్పుడు చెప్పబ్బాయ్.." కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

"సార్! మీ డిపార్ట్ మెంట్ లో సూపర్వైజర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని అప్లై చేశాను సార్. మీరు కొంచెం చూడాలి. ఏమైనా ఫార్మాలిటీలు నేను చూసుకుంటాను సార్." డైరెక్టుగా విషయం లోకి వచ్చాడు కుర్రాడు.

"చేపకి కంగారుగా ఉంది పాపం." మనసులో అనుకుంటూ పైకి "అబ్బాయ్!అతను చెప్పాడేమోగాని ఈ మధ్య అంతగా పనులు కావటం లేదోయ్ ..." అంటూ ఆపాడు.

"అమ్మమ్మ! మీరు దయతలచాలి." ఈ సారి అబ్బాయి తండ్రి దీనంగా ముఖం పెట్టాడు.

"అలా కాదండి. గ్యారంటీగా పోస్టింగ్ కావాలంటే అయిదు దాకా అవుతుంది. అహహ..అలా చూడకండి..మీ పని కాకపోతే మొత్తం డబ్బు పువ్వుల్లో పెట్టి తిరిగిచ్చేస్తాను." కుండ బద్దలు కొట్టాడు శంకర్రావు. అంకె వినగానే తండ్రీ కొడుకుల ముఖం దిగాలుగానూ, భయంగానూ, ఆందోళనగానూ మారిపోయాయి.

"అదిగో ..మీరు నన్ను నమ్మడం లేదు. మీకు ఆ అయిదుకీ ప్రామిసరీ నోటు రాసిస్తానండి. మీ డబ్బు నాకెందుకూ! నా చేతుల మీదుగా పది మంది కుర్రాళ్ళకి ఉద్యోగాలు దొరుకుతున్నాయన్న తృప్తి చాలు నాకు." ఉద్వేగంగా చెప్పాడు శంకర్రావు.

"అయ్యో! ఎంతమాటన్నారు? మిమ్మల్ని నమ్మకపోవడమా! మీ గురించి ఎంతోమంది చెప్పారు. రేపే ఆ అయిదూ  తీసుకొస్తాను. మా వాడి సంగతి మాత్రం పూర్తిగా మీకే వదిలేస్తున్నాను. కొంచెం చూసుకోవాలి మరి." ఖంగారుగా అన్నాడు పెద్దాయన.

"భలే వాళ్ళు మీరు. మీ వాడికి ఉద్యోగం తెప్పించే భారం నాది. అయితే మీ వాడు పేరుకు మా డిపార్టుమెంటు పెట్టే ఎక్జామినేషన్ రాయాలి. అందులో పాసయ్యాకా...ఒక ఇంటర్వ్యూ అటెండ్ అవ్వాలి. అదీ ఉత్తుత్తినే సుమండీ." చిన్న బాంబు వేసి రియాక్షన్ చూశాడు శంకర్రావు.

"అలాగేనండి. రాస్తాను కానీ పరీక్ష కష్టంగా ఉంటుందాండి?" అనుమానంగా అడిగాడు కుర్రాడు.

"ఫర్వాలేదబ్బాయ్! అయితే ఒక మాట..నువ్వు పరీక్ష ఎంత బాగా రాస్తే మనం ఇవ్వాల్సింది అంత తగ్గుతుంది. ఒక వేళ నీ అంతట నువ్వే సెలక్ట్ అయ్యిపోయావనుకో! అసలు మనం ఇచ్చేదేమీ ఉండదు. కాబట్టి నీ ప్రయత్నం నువ్వు చెయ్యి. కాకపోతే నేనున్నాను. సరేనా!" అంటూ వాళ్ళని సాగనంపాడు శంకర్రావు.

మర్నాడు ఆ కుర్రాడు ఇచ్చిన అయిదు లక్షలూ రొక్కంగా పుచ్చుకొని వాళ్ళు వద్దు వద్దంటున్నా ఆ మొత్తానికి ప్రోనోటు రాసిచ్చాడు. వాళ్ళు సంతోషంగా వెళ్లిపోయారు. లోపలికొచ్చిన శంకర్రావు ఎవరికో ఫోన్ చేశాడు. అవతలి వ్యక్తి ఫోన్ ఎత్తగానే "మేనేజరు గారా! ఈ రోజు అయిదు లక్షలు ఒక సంవత్సరానికి ఫిక్సెడ్ వేస్తున్నానండి. పదింటికి వస్తాను." చెప్పాడు.

"ఏవండీ! నాకు వడ్డాణం చేయించరూ!" గారాలు పోయింది శ్రీమతి.

"ఛ!ఛ! తప్పు తప్పు! ఇది మన డబ్బు కాదు. వడ్డీ మాత్రమే మనది. ఇంకెప్పుడూ అలా అనకు." కసిరాడు. శ్రీమతి మూతి తిప్పుకుంటూ పోయింది.

"అమ్మయ్య! నోటిఫికేషన్ పడ్డ దగ్గర్నుండి ఇది పన్నెండో చేప." ఆనందంగా అనుకుంటూ సోఫాలో కూర్చుని టీవీ ఆన్ చేశాడు.

★★★

సంవత్సరంన్నర రోజులు శంకర్రావుకు శరవేగంగానూ, అతగాడికి డబ్బులిచ్చిన ఇంకొక నలుగురితో కలిపి పదహారు మంది అభ్యర్థులకీ భారంగానూ గడిచింది. ఇంతకాలం ఏమీ చెయ్యకుండా హాయిగా తన ఉద్యోగమూ, వడ్డీ వ్యాపారమూ మాత్రమే చూసుకున్న శంకర్రావు ఈ ఉద్యోగ ఫలితాలు బయటకు వచ్చే సమయానికి మాత్రం సదరు క్లర్కు కు ఉదారంగా ఒక ఏభై వేలు సమర్పించి రాబోయే రిజల్ట్సను పది రోజులు ముందుగా కొనుక్కున్నాడు. అతనికి చిక్కిన చేపలలో రెండు చేపలకి ఉద్యోగాలొచ్చాయి. "ఫరవాలేదు, వెధవలు బాగానే కష్టపడి నా పేరు నిలబెట్టారు." అనుకుంటూ ఫోన్ తీసుకున్నాడు. ఉద్యోగాలొచ్చిన వాళ్ళకి శుభవార్త చెప్పి వాళ్ళ పొగడ్తలూ కృతజ్ఞతలూ అందుకుని "మీకో మాట చెప్పాలండి. మనం అనుకున్నదానికంటే ఒక ఏభై వేలు ఎక్కువయ్యాయి. అలాగే! అబ్బాయి జాయినయ్యేలోగా సర్దొచ్చు. మీకు పది రోజుల్లో ఆర్డర్స్ వస్తాయి. ఖంగారు పడకండి." ఇద్దరికీ చెప్పేశాడు.

ఇక మిగిలిన పధ్నాలుగు మందికీ చావుకబురు చల్లగా చెప్పాడు. దాంతో పాటే "మీరేమీ కంగారుపడకండి. ఈ సారి మనకు హెల్ప్ చేసేవాడు కరెక్టు టైముకి టైఫాయిడ్ బారిన పడ్డాడు. లేకపోతే మన పనైపోయేదే. రేపో ఎల్లుండో వచ్చి మీ ఐదూ మీరు పట్టికెళిపోండి. మరేం ఫరవాలేదు" అంటూ చెప్పాడు.

అనుకున్నట్టుగానే ఉద్యోగం దొరకని ఒక చేప శంకర్రావు చెప్పిన డేటుకి, చెప్పిన సమయానికి హడావుడిగా, కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ వచ్చేసింది.

"సార్! ఏమిటిది? ఇలాగయ్యింది..మిమ్మల్ని ఎంతో ఆశతో నమ్ముకున్నామే. చివరికి మీ వల్ల కూడా ఏమీ కాలేదు." బాధగా అన్నాడు.

"అవునబ్బాయ్! ఏం చేస్తాం..నువ్వు పరీక్ష మరీ నాసిగా రాసావంట. ఇలా అయితే మేము చేయలేమని వాళ్ళు పదిరోజులకిందటే చెప్పేశారు. మీరు బాధ పడతారని  ముందుగా చెప్పలేదు. పోనీలే ఆర్నెల్లకి మళ్ళీ పోస్టులు పడతాయి. అప్పుడు చూద్దాంలే. అందాకా ఇదిగో మీరిచ్చిన అయిదు. జాగ్రత్తగా లెక్కపెట్టుకోండి."

చేపా,చేప తండ్రీ ఆశ్చర్యపోయారు. ఇలాగ తామిచ్చిన డబ్బు సజావుగా ఇంత సులభంగా వెనక్కి వస్తుందని కలలో కూడా అనుకోలేదు.

అప్పుడు చెప్పాడు శంకర్రావు నెమ్మదిగా "మీరు అసలే బాధల్లో ఉన్నారు చెప్పకూడదు కానీ పని అవ్వకపోయినా నాకు మాత్రం పాతిక దాకా ఖర్చయింది. అహహ...మీరివ్వద్దు లెండి..ఎవడో జేబు కొట్టేశాడనుకుంటాను. ఏం చేద్దాం?" దీనంగా అన్నాడు.

చేప తండ్రికి శంకర్రావు ముఖం చూసి బాధేసింది. అంతకంటే ఎక్కువగా నెక్ట్ టైమ్ వీడు మనకి సాయం చెయ్యడేమోనని అనుమానం కలిగింది. ఖంగారుగా తన చేతిలోని అయిదు లక్షలనుండి పాతికవేలు తీసి శంకర్రావు చేతిలో పెట్టాడు.

"భలేవారు సార్ మీరు..మీ చేతిలోంచి పెట్టనిస్తానా? తీసుకోండి." అంటూ.. బయలుదేరుతున్నపుడు ఒక మాట చెప్పాడు. "సార్ మళ్ళీ నోటిఫికేషన్ వస్తే చెప్పండి. వెంటనే వస్తాం. ఇక భారం మీదే" రెండు చేతులా నమస్కారం పెట్టి బయటకు నడిచాడు.

"అలాగే..కానివ్వండి." అంటూ వాళ్ళను గుమ్మం దాకా సాగనంపాడు శంకర్రావు.

★★★

మిగతా పదమూడు చేపలూ ఇంచుమించు డైలాగులు అటూ ఇటూగా చెప్పుకొని ఇలాగే సమర్పించుకుని వెళ్లాయి.

ఆఖర్న శంకర్రావు లెక్కలు చూసుకున్నాడు. ఎనభై లక్షలకి ఒకటిన్నరేళ్ళకి బ్యాంకు వడ్డీ తొమ్మిది లక్షలు, ఇద్దరు సెలక్ట్ అయ్యిన వాళ్ళ దగ్గిర పదకొండు లక్షలు, అవ్వని వాళ్ళ దగ్గర మూడు లక్షల ఏభై వేలలో క్లర్కుకి

ఇచ్చింది పోతే మొత్తం ఇంట్లో కూర్చుని ఏ పనీ చెయ్యకుండా సంపాదించింది అక్షరాలా ఇరవై మూడు లక్షలూ, బోలెడంత మంచి పేరూనూ. ఆ సాయంకాలం శంకర్రావు సతీ సమేతంగా నగల దుకాణాన్ని పావనం చేసే ఉంటాడు మరి.

★★★

# COMMENTS